
JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
2026 Happy New Year
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 01-01-2026
Medchal - Malkajgiri । Thursday 01-01-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 216
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 216 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jaya...il.com

## కొత్త ఏడాదిగా ఘన స్వాగతం



✍ జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 31:

2026కి స్వాగతం పలికిన పసిఫిక్ దేశాలుప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్యాలెండర్ మారుతున్న వేళ.. కిరిబాటి దీవుల తర్వాత న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరం 2026కు ఘన స్వాగతం పలికింది. అక్కడి స్థానిక సమయం ప్రకారం గడియారం ముల్లు 12 దాటగానే.. ఆక్లాండ్ నడిబొడ్డున ఉన్న న్యూజిలాండ్ ఎత్తైన కట్టడం 'స్కై టవర్' బాణసంచా వెలుగులతో మెరిసిపోయింది. సుమారు 5 నిమిషాల పాటు సాగిన ఈ కనువిందులో 3,500 రకాల బాణసంచాను స్కై టవర్ అంతస్తుల నుంచి కాల్చారు. అయితే, అక్కడి వాతావరణం వేడుకలకు కాస్త ఆటంకం కలిగించింది. భారీ వర్షం, ఉరుముల సూచన ఉండటంతో న్యూజిలాండ్ నార్త్ ఐలాండ్‌లోని పలు చిన్న కమ్యూనిటీ ఈవెంట్లను రద్దు చేశారు. అయినా ప్రధాన వేడుకలు మాత్రం వర్షంలోనే కొనసాగాయి. ఆక్లాండ్ కంటే ముందే, పసిఫిక్ మహాసముద్రంలోని మారుమూల దేశమైన 'కిరిబాటి'లోని ఓ అటోల్ (కిరితిమతి దీవి) ప్రపంచంలోనే తొలిసారిగా 2026లోకి అడుగు పెట్టింది. అక్కడి అనుభవాన్ని ఓ పర్యాటకుడు వివరిస్తూ.. "శాటిలైట్లు లేవు, మనుషుల జాడ లేదు, చిమ్మచీకటి, లెక్కలేనన్ని పీతలు మాత్రమే ఉన్నాయి" అంటూ ప్రకృతి ఒడిలో న్యూ ఇయర్ జరుపుకున్నట్లు తెలిపారు. ఇక 600 మంది జనాభా మాత్రమే ఉండే న్యూజిలాండ్ చాతం ఐలాండ్‌లోనూ కొత్త ఏడాది సంబరాలు జరిగాయి. తెల్లవార్లూ తమ బృందం వేడుకలు చేసుకుంటుందని అక్కడి ఓ హోటల్ యజమాని పేర్కొన్నారు. ప్రపంచంలోని తూర్పు దేశాల నుంచి పడమర వైపునకు కొత్త సంవత్సరం 2026 నెమ్మదిగా విస్తరిస్తోంది.

## అమల్లోకి కొత్త ఇమ్మిగ్రేషన్




✍ జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 31:

అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం గ్రీన్ కార్డ్ హోల్డర్లకు, అంటే అమెరికాలో శాశ్వత నివాసం ఉన్నవారికి.. అలాగే గ్రీన్ కార్డ్ లేకుండా అమెరికాలో నివసిస్తున్న వారికి కఠినమైన ఇమ్మిగ్రేషన్ నిబంధనలను అమలు చేసింది. ఈ నిబంధనల వల్ల అమెరికాలో నివసిస్తున్న పౌరులు కానివారి కష్టాలు పెరగనున్నాయి. అమెరికా పౌరసత్వం లేని వారిపై దీని ప్రభావం నేరుగా పడుతుంది.అమెరికా ప్రభుత్వం ప్రకారం ఈ కొత్త నిబంధనల ముఖ్య ఉద్దేశ్యం ఏంటంటే.. సరిహద్దు భద్రతను బలోపేతం చేయడం. అదే విధంగా అక్రమ చొరబాట్లను అరికట్టడం. మీరు కూడా అమెరికాలో నివసిస్తూ, అమెరికా పౌరసత్వం లేనివారైతే ఈ నిబంధనల గురించి తెలుసుకోవడం మీకు చాలా ముఖ్యం. అమెరికాలో శాశ్వత నివాసం ఉంటున్న గ్రీన్ కార్డ్ హోల్డర్లకు సైతం ట్రంప్ నిర్ణయాలతో తలనొప్పులు తప్పడం లేదు.అమెరికా ప్రభుత్వం ఈ కొత్త ఇమ్మిగ్రేషన్ నిబంధనలను దేశవ్యాప్తంగా డిసెంబర్ 26, 2025 నుంచి అమలు చేసింది. ఈ నిబంధనల ప్రకారం అమెరికా పౌరసత్వం లేని వారు, గ్రీన్ కార్డ్ హోల్డర్లతో సహా ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. కొత్త నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి అమెరికా నుండి బయటకు వెళ్లి తిరిగి దేశంలోకి ప్రవేశిస్తే, అతను బయోమెట్రిక్ వ్యవస్థ ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. అంటే, అమెరికాలో నివసిస్తున్న పౌరులు కాని వారందరి గుర్తింపు ఇకనుంచి డిజిటల్ పద్ధతిలో జరుగుతుంది. ఇందులో వేలిముద్రలు, ఫోటోలు ఉంటాయిగతంలో

...మిగతాది 2 లో

*14 ఏళ్ల పోరాటం. పదేళ్ల అధికారం. రెండేళ్ల ప్రతిపక్ష పాత్ర. ఒకే ఒక్కడు. ఆయనే కేసీఆర్. నాడు ఉద్యమ నాయకుడిగా అయినా.. తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా.. ఇప్పుడు ప్రతిపక్ష నేతగా.. ఆయన ఫాంహౌస్‌లో ఉన్నా వార్తే. తెలంగాణ భవన్‌కు వచ్చినా హాట్ టాపికే. అసెంబ్లీకి అటెండ్ అయితే అందరిలో క్యూరియాసిటీ. అలాంటి సీనే మళ్లీ రిపీట్ అయింది. ఆఫ్టర్ ఏ లాంగ్ టైమ్ కేసీఆర్ మీడియా ముందుకు వచ్చారు.*



2 లో

# కేడర్ లో జోష్ నింపిన కేసీఆర్

■ **జనవరి 2 నుంచి అసెంబ్లీకి**

✍ జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 31:

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ రాజకీయ క్షేత్రంలో తనదైన శైలిలో గర్జించారు. తెలంగాణ రాజకీయాల్లో మునుపటి జోష్‌ను నింపుతూ పార్టీ రాష్ట్రస్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడిన తీరు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించకుండానే, అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన సంధించిన విమర్శనాస్త్రాలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఎదుర్కొంటున్న వైఫల్యాలను ఎండగట్టిన ఆయన, ముఖ్యంగా ప్రజల ప్రాణధారమైన కృష్ణా జలాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ఈ వ్యవహారంలో రెండు ప్రభుత్వాలు 'దొంగాట' ఆడుతున్నాయని, తెలంగాణ హక్కులను తాకట్టు పెడుతున్నాయని ఆయన మండిపడ్డారు. పాలనాపరమైన వైఫల్యాలపై కేసీఆర్ చేసిన విమర్శలు గంభీరంగా ఉండటమే కాకుండా, తెలంగాణ అస్తిత్వానికి సంబంధించిన అంశాల చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పేరును ఎక్కడా ఉచ్చరించకుండానే, కేసీఆర్ తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ వైఖరి వల్ల రైతులకు, సాధారణ ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను ఆయన సోదాహరణంగా వివరించారు. ముఖ్యంగా కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.తన పదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధిని, ప్రస్తుత పరిస్థితిని పోలుస్తూ ఆయన చేసిన విమర్శలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. గతంలో కంటే మరింత స్పష్టతతో, పదునైన మాటలతో కేసీఆర్ రంగంలోకి దిగడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. కేసీఆర్ పునరాగమనం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీస్తుందన్న సంకేతాలను ఈ సమావేశం బలంగా ఇచ్చింది.

## ఒక్క రోజే ముందే ఫించన్లు



✍ జయభేరి, విజయవాడ, డిసెంబర్ 31 :

ఏపీలో నూతన సంవత్సర కానుకగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఇవాళ పండుగ వాతావరణంలో జరిగింది. సాధారణంగా ప్రతినెలా ఒకటో తేదీన జరిగే ఈ కార్యక్రమం.. (జనవరి 1వ తేదీ) సెలవు దినం కావడంతో ఒక రోజు ముందుగానే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచే వాలంటీర్లు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నగదు పంపిణీ చేయగా, మధ్యాహ్నం 12 గంటల సమయానికి రికార్డు స్థాయిలో 87 శాతం పంపిణీ పూర్తయింది. ఈ నెలలో మొత్తం 63.12 లక్షల మంది లబ్ధిదారుల

...మిగతాది 2 లో



## ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయనున్న కవిత

✍ జయభేరి, కరీంనగర్, డిసెంబర్ 31:

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమకారులతో కలిసి వారికి ఇంటి స్థలాలు కేటాయించాలని పోరాటం చేయనుంది. కరీంనగర్ జిల్లా మానకొండూరు వేదికగా కవిత భూ పోరాటాన్ని ప్రారంభించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని

...మిగతాది 2 లో

## త్వరలో 14 వేల పోలీస్ కానిస్టేబుళ్ల భర్తీ

■ **కొత్త సంవత్సరం 2026లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం**

■ **డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం**



2 లో



## ఏపీ ప్రభుత్వంతో కుమ్మక్కు

■ **తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్న హరీష్**

✍ జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 31:

ఏపీ ప్రభుత్వం గతంలో ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టును ప్రస్తుతం నల్లమల సాగర్ కిందకు మార్చిందని, ఇది కేవలం పేరు మార్పు మాత్రమే తప్ప లక్ష్యం మాత్రం తెలంగాణ నీటిని దొంగిలించడమేనని హరీష్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో హరీష్‌రావు ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన

▸▸ మొదటిపేజీ తరువాయి

## కేడర్ లో జోష్ నింపిన కేసీఆర్

**జనవరి 2 నుంచి అసెంబ్లీకి...**

14 ఏళ్ల పోరాటం. పదేళ్ల అధికారం. రెండేళ్ల ప్రతిపక్ష పాత్ర. ఒకే ఒక్కడు. ఆయనే కేసీఆర్. నాడు ఉద్యమ నాయకుడిగా అయినా.. తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా.. ఇప్పుడు ప్రతిపక్ష నేతగా.. ఆయన ఫాంహౌస్‌లో ఉన్నా వార్తే. తెలంగాణ భవన్‌కు వచ్చినా హాట్ టాపిక్కే. అసెంబ్లీకి అటెండ్ అయితే అందరిలో క్యూరియాసిటీ. అలాంటి సీనే మళ్లీ రిపీట్ అయింది. ఆఫ్టర్ ఏ లాంగ్ టైమ్ కేసీఆర్ మీడియా ముందుకు వచ్చారు. కృష్ణా జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై కాంగ్రెస్ సర్కార్ తీరును తూర్పార బట్టారు. ఇక పోరు బాటే అంటూ హెచ్చరించారు. ఆ తర్వాత వారం రోజుల్లోనే అసెంబ్లీ స్టార్ట్ అయింది. మొదటి రోజు సమావేశాలకు సార్ అటెండ్ అయ్యారు. ప్రధాన ప్రతిపక్ష నేత అయిన కేసీఆర్ దగ్గరికి వెళ్లి మరీ సీఎం రేవంత్ పలకరించారు.

ఆ తర్వాత సభలో 5 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు మాజీ సీఎం. దీంతో కేసీఆర్ సభకు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇంతకు జనవరి 2 నుంచి జరిగే అసెంబ్లీ సెషన్స్‌కు కేసీఆర్ వస్తారా రారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో నందినగర్‌లోని తన నివాసంలో ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహిస్తూ..శాసనసభ వేదికగా సర్కార్‌ను ఇరుకునపెట్టే ప్లాన్ చేస్తున్నారట గులాబీ దళపతి.అటు సర్కార్ కూడా జనవరి రెండు నుంచి జరిగే అసెంబ్లీ సెషన్స్‌లో కృష్ణా గోదావరి జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చకు సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎజెండాను కూడా ఫిక్స్ చేసింది. జనవరి 2న కృష్ణా, 3న గోదావరి బేసిన్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సభలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు తమకు కూడా అవకాశం ఇవ్వాలని ప్రతిపక్షం బీఆర్ఎస్ కోరుతోంది. కీలక అంశాలపై చర్చ అసెంబ్లీలో చర్చ జరగనున్న నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ సభకు వస్తారా రారా అన్నదే ఆసక్తికరంగా మారింది.

అయితే జనవరి రెండు నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌కు అటెండ్ కావాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. కృష్ణాగోదావరి జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చలో పాల్గొని నిజానిజాలు చెప్పాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు టాక్. అసెంబ్లీకి హాజరుపై ముఖ్యనేతల సమావేశంలో గులాబీ బాస్ ఇండైరెక్ట్ హింట్ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఏ అంశంపై అయినా చర్చకు మనం రెడీగా ఉన్నామ్.. ప్రిపేర్ అయి రావాల్సింది అధికార పక్షం. మనది డైరెక్ట్ అటాకే. నీటి లెక్కలన్నీ నాలుక మీదే ఉన్నాయని కేసీఆర్ అన్నట్లుగా తెలుస్తోంది. దీంతో సార్ సభకు వస్తారన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది.కృష్ణా జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై మీడియా సమావేశంలో కేసీఆర్ చేసిన కామెంట్స్‌కు..సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చించేందుకు ప్రభుత్వం రెడీగా ఉందని..దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని ఛాలెంజ్ చేశారు.

దీంతో తాను సభకు హాజరు కాకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే స్వయంగా తాను సభకు హాజరై..కృష్ణాజలాలు, పాలమూరు ఎత్తిపోతలపై చర్చలో పాల్గొని కాంగ్రెస్ సర్కార్ తీరును ఎండగట్టాలని డిసైడ్ అయ్యారట గులాబీ బాస్.ఇరిగేషన్ విషయంలో సీఎంతో సహా మంత్రులెవరికీ సరైన అవగాహన లేదని కేసీఆర్ అంటున్నారు. అందుకే వాళ్లు మాట్లాడాలంటే ప్రిపేర్ అయి రావాలి. మనది డైరెక్ట్ అటాకే అని కారు పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారట. మొత్తం అసెంబ్లీ సెషన్‌కు కాకపోయినా..నదీ జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై చర్చకు మాత్రం తాను తప్పకుండా అటెండ్ కావాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే.. విమర్శలు, ప్రతి విమర్శలు..వాగ్వాదాలు..సభ ఎంత ఇంట్రెస్టింగ్‌గా కొనసాగుతుందో చూడాలి.

## ఏపీ ప్రభుత్వంతో కుమ్మక్కు

నల్లమల సాగర్ ప్రాజెక్టుపై, అలాగే రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఇది కేవలం నీటి తరలింపు కాదని, తెలంగాణ హక్కులను కాలరాసే జల దోపిడీ అని అభివర్ణించారు. నల్లమల సాగర్ అక్రమ ప్రాజెక్టుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సూత్రధారి అయితే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాత్రధారిగా మారి జల ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటక, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలు తమ నీటి వాటా కోసం గట్టిగా పోరాడుతుంటే, రేవంత్ రెడ్డి మాత్రం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించే పనిలో ఉన్నారని మండిపడ్డారు. తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారుగా మాజీ అధికారి ఆదిత్యానాథ్ దాస్ నియామకాన్ని హరీష్ రావు తీవ్రంగా తప్పుబట్టారు.

గతంలో ఏపీ సీఎస్‌గా ఉండి, తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవడానికి వందకు పైగా లేఖలు రాసిన వ్యక్తిని తీసుకొచ్చి సలహాదారుగా పెట్టుకోవడం అంటే దొంగకు తాళాలు ఇచ్చినట్లే అని విమర్శించారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తికి కీలక బాధ్యతలు ఇవ్వడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, ఇది తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన స్పష్టం చేశారు. బనకచర్ల, నల్లమల సాగర్ వివాదాల పరిష్కారానికి రెండు రాష్ట్రాల ప్రతినిధులతో కమిటీలు వేయడాన్ని హరీష్ రావు ఒక డ్రామాగా అభివర్ణించారు. ఒకవైపు కోర్టులో కేసు వేస్తూ, మరోవైపు చర్చల కోసం కమిటీలు వేయడం వల్ల కోర్టులో కేసు వీగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొట్టినట్లు ఉండాలి.. దెబ్బ తాకకూడదు అన్న చందంగా రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఏపీ జలదోపిడీ సాగడానికి పరోక్షంగా సహకరిస్తోందని ఆరోపించారు.

గోదావరి కృష్ణా అనుసంధానం ద్వారా తెలంగాణకు దక్కాల్సిన 45 టీఎంసీల వాటాను ఏపీ గంపగుత్తగా తరలించుకుపోయే ప్రయత్నం చేస్తోందని హరీష్ రావు వివరించారు. ఈ విషయంలో సీడబ్ల్యూసీ నుంచి అనుమతులు వచ్చినా తెలంగాణ ప్రభుత్వం నిద్ర నటిస్తోందని విమర్శించారు. రేవంత్ రెడ్డికి నిజంగా తెలంగాణపై ప్రేమ ఉంటే, అసెంబ్లీలో నల్లమల సాగర్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని, ఢిల్లీలోని సీడబ్ల్యూసీ కార్యాలయం ముందు ధర్నాకు రావాలని సవాల్ విసిరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పక్షాన తామే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వం గోదావరి నీళ్లు కృష్ణా ద్వారా తరలిస్తే, గోదావరి అవార్డు ప్రకారం, 45:21:14 తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు కృష్ణాలో నీటి వాటా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విధంగా కూడా తెలంగాణకు నీటి వాటా దక్కకుండా ఉండేందుకు కృష్ణాలో కలుపకుండానే, పెన్నా బేసిన్ కు గోదావరి నీటిని తరలించే పెద్ద కుట్రకు తెరతీశారన్నారు. నిజానికి పోలవరం బనకచర్ల విషయంలో కర్ణాటక, మహారాష్ట్రలు తీవ్ర అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాశాయన్నారు. వరద జలాల మీద కట్టే ప్రాజెక్టు కట్టేందుకు ఏపీకి అవకాశం ఇస్తే అదేవిధంగా ప్రాజెక్టులు కట్టేందుకు డీపీఆర్‌లు పంపుతామని అన్నారని.. గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం ప్లాన్ కర్ణాటక, మహారాష్ట్రకు అర్థం అయ్యింది, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రం అర్థం కాలేదన్నారు.

## అమల్లోకి కొత్త ఇమ్మిగ్రేషన్

అమెరికాలో 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు, వృద్ధులకు బయోమెట్రిక్ ప్రక్రియ నుండి మినహాయింపు ఉండేది. దేశంలోకి ప్రవేశించేటప్పుడు లేదా బయటకు వెళ్ళేటప్పుడు వారికి వేలిముద్రలు ఇవ్వడం, ఫోటో తీయించుకోవడం అవసరం లేదు. కానీ కొత్త నిబంధనల అమలులోకి వచ్చాక ఈ మినహాయింపు రద్దు చేశారు. ఇప్పుడు ప్రతి వయస్సు వారు బయోమెట్రిక్ ప్రక్రియ ద్వారా వెళ్ళవలసి ఉంటుందికొత్త నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ, ఇప్పుడు ఏ వ్యక్తి అయినా అమెరికాలోకి ప్రవేశించినా.. దేశం నుంచి బయటకు వెళ్ళేటప్పుడు రెండు సందర్భాలలోనూ బయోమెట్రిక్ విధానం ద్వారా మాత్రమే వెళ్లే వీలుంటుంది. గతంలో ఈ నిబంధన దేశంలోకి ప్రవేశించేటప్పుడు మాత్రమే వర్తించేది. ఎవరు ఎంతకాలం అమెరికాలో ఉన్నారు. ఎప్పుడు దేశం నుండి బయటకు వెళ్లారనే విషయాలను తెలుసుకోవడం దీని ఉద్దేశ్యం. దాంతోపాటు అక్రమ చొరబాట్లు, గడువు ముగిసినా అమెరికాలో ఉండే వీలు లేకుండా పోతుంది.

**ఎక్కువ కాలం బయట ఉంటే గ్రీన్ కార్డ్‌కు ప్రమాదం**

ఒకవేళ గ్రీన్ కార్డ్ హోల్డర్ ఒక సంవత్సరం కంటే ఎక్కువ రోజు అమెరికా బయట ఉంటే, వారి గ్రీన్ కార్డ్ స్టేటస్‌కు ముప్పు పొంచి ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పుడు అధికారులు వ్యక్తి ప్రయాణ రికార్డులను కూడా పరిశీలిస్తారు. అంటే వారు ఎన్నిసార్లు అమెరికా నుండి బయటకు వెళ్లారు. ఎప్పుడు దేశంలోకి తిరిగి వచ్చారనేది చూస్తారు. కొత్త రూల్స్ ప్రకారం, ఒక వ్యక్తికి అమెరికాకు పరిమిత కాల వ్యవధి వీసా లభించి, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అమెరికాలో నివసిస్తే, డిజిటల్ వ్యవస్థ ద్వారా వెంటనే అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకుంటారు.

# రాజకీయ వ్యూహాలు.. కుటుంబ బంధాలు..!

**మహారాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మలుపు చోటుచేసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా రాజకీయంగా దూరంగా ఉన్న అన్నదమ్ములు ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే మళ్లీ ఒక్కటయ్యారు. ఈ కలయిక మహారాష్ట్ర రాజకీయాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా 2026 ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో వీరిద్దరూ కలిసి పనిచేయాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.**



ముంబైలోని శివాజీ పార్క్ సమీపంలో ఉన్న శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ థాకరే స్మారక చిహ్నం వద్ద ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఒకే కారులో రాజ్ థాకరే ఇంటి నుంచి రావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇది కేవలం ఒక కుటుంబ సమావేశం మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ మార్పులకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.విభేదాలు, వ్యక్తిగత అపార్థాల కారణంగా విడిపోయిన ఈ కుటుంబం మళ్లీ కలవడం మరాఠీ ఓటర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రత్యేకంగా ఏక్‌నాథ్ షిండే వర్గంతో తీవ్రంగా పోరాడుతున్న ఉద్ధవ్ థాకరేకు, తమ్ముడు రాజ్ థాకరే మద్దతు లభించడం ఒక పెద్ద ప్లస్ పాయింట్‌గా కనిపిస్తోంది. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉద్ధవ్ థాకరే రాజకీయ భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారాయి. ఎందుకంటే ఈ ఎన్నికల్లో గెలుపు సాధిస్తేనే శివసేన అసలైన వారసుడు ఎవరు అన్న విషయం ప్రజల్లో స్పష్టతకు వస్తుంది.మరాఠీ మనుషుల హక్కుల కోసం, ముంబై ఆత్మగౌరవం కోసం తామంతా ఒక్కటయ్యామని ఈ ఇద్దరు నాయకులు ప్రకటించారు. కులమతాలకు అతీతంగా ముంబై ప్రజలందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని శివసేన నాయకులు పేర్కొన్నారు. విడిపోయి పోరాడితే అది ఇక్కడి అమరవీరులకు చేసే అవమానమని కూడా వారు స్పష్టం చేశారు.రాజ్ థాకరే తన ప్రసంగంలో ఐక్యతను బలంగా చాటారు. వ్యక్తిగత అపార్థాల కన్నా మహారాష్ట్ర గౌరవమే ముఖ్యమని అన్నారు. సీట్ల పంచకాలు కన్నా ముంబై ప్రయోజనాలే తమకు ప్రాధాన్యత అని, నాసిక్ వంటి ఇతర కార్పొరేషన్లలో కూడా ఈ పొత్తు కొనసాగుతుందని వెల్లడించారు.

ఈ పొత్తు ద్వారా ముంబై పీఠాన్ని తప్పకుండా దక్కించుకుంటామని రాజ్ థాకరే ధీమా వ్యక్తం చేశారు. అయితే ఈ రాజకీయ పొత్తు ద్వారా నిజంగా లాభం ఎవరికీ? నష్టం ఎవరికీ? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో వినిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ కలయిక వల్ల లాభం నేరుగా ముంబై ప్రజలకు చేరుతుందా? లేక ఈ ఇద్దరు సోదరులకు, వారిని నమ్ముకున్న నాయకులకు మాత్రమే పరిమితమవుతుందా? అన్న సందేహాలు ఉన్నాయి. మరోవైపు, ఈ పొత్తు వల్ల షిండే వర్గానికి, అలాగే మహారాష్ట్రలోని ఇతర రాజకీయ పార్టీలకు ఇది పెద్ద సవాల్‌గా మారనుంది. మరాఠీ ఓటు బ్యాంక్ మళ్లీ ఒకే చోట చేరితే, రాబోయే ఎన్నికల్లో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మొత్తంగా చూస్తే, థాకరే బ్రదర్స్ కలయిక కేవలం ఒక కుటుంబ పునర్మిళనం మాత్రమే కాదు. ఇది మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక మలుపు. దీని ఫలితం ముంబై మున్సిపల్ ఎన్నికలతో పాటు, రాష్ట్ర రాజకీయాల దిశను కూడా నిర్ణయించనుంది. ఈ పొత్తు ద్వారా ఎవరు గెలుస్తారు, ఎవరు నష్టపోతారు అన్నది కాలమే తేల్చాలి. కానీ ఇప్పటికైతే, ఈ కలయిక మహారాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా కొనసాగుతోంది.2023లో ఎన్సీపీ చీలిక తర్వాత ఉప్పునిప్పులా విడిపోయిన బాబాయ్‌అబ్బాయ్ (శరద్ పవార్, అజిత్ పవార్) మళ్లీ చేతులు కలిపారు. రాబోయే పింప్రిచించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం రెండు వర్గాలు కలిసి పోటీ చేస్తాయని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అధికారికంగా ప్రకటించారు. "రాష్ట్ర అభివృద్ధి కోసం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. గడియారం, ట్రంపెట్ గుర్తులు ఇప్పుడు ఏకమయ్యాయి. పవార్ కుటుంబం మళ్లీ ఒక్కటైంది" అని ఆయన పేర్కొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.పింప్రిచించ్వాడ్ ప్రాంతం దశాబ్దాలుగా పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. 1999 నుంచి 2017 వరకు ఇక్కడ పవార్ల హవానే నడిచింది. అయితే 2017లో బీజేపీ ఈ కోటను కైవసం చేసుకుంది. అయితే ఇప్పుడు ఆ పాత వైభవాన్ని తిరిగి తెచ్చుకోవడమే లక్ష్యంగా ఇరు వర్గాలు పొత్తుకు సిద్ధం అయ్యాయి. కేవలం కుటుంబం కలవడమే కాకుండా.. ఓట్లు చీలిపోకుండా చూసి బీజేపీని దెబ్బకొట్టాలనేది వీరి మాస్టర్ ప్లాన్. సీట్ల సర్దుబాటుపై చర్చలు ఇప్పటికే ముగిశాయని.. త్వరలోనే తుది జాబితా విడుదల చేస్తామని అజిత్ పవార్ స్పష్టం చేశారు.ఈ పొత్తుపై మహాయుతి కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. బీజేపీ నేత నవనీత్ రాణా మాట్లాడుతూ.. "అజిత్ పవార్ ఎప్పుడూ శరద్ పవార్ మాట వింటారని మాకు తెలుసు. ఇప్పుడు వారు కలవడం సంతోషకరం. త్వరలోనే శరద్ పవార్ కూడా ఎన్డీయేలో చేరుతారని ఆశిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అయితే ఏక్‌నాథ్ షిండే శివసేన వర్గం మాత్రం దీనిని తీవ్రంగా విమర్శించింది. మహారాష్ట్ర ప్రజలు కేవలం 'ఇంటి పేరు' చూసి ఓట్లు వేయరని.. అభివృద్ధి చేసే వారికే పట్టం కడతారని పైనా ఎన్సీ వంటి నేతలు ఎద్దేవా చేశారు.ముంబై, పుణెతో పాటు పింప్రిచించ్వాడ్ సహా మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లకు 2026 జనవరి 15వ తేదీన పోలింగ్ జరగనుంది. మరుసటి రోజు అంటే జనవరి 16వ తేదీన ఓట్ల లెక్కింపు చేపడతారు. నామినేషన్ల దాఖలుకు డిసెంబర్ 30 చివరి తేదీ కావడంతో.. పవార్ల పొత్తు ప్రకటన అభ్యర్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పుణె రీజియన్‌లో పట్టు సాధించేందుకు 'పవార్ పరివార్' వేసిన ఈ ఎత్తుగడ ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి.

## ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయనున్న కవిత

ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేస్తున్నారు. ఈ హామీని అమలు చేయాల్సిందిగా డిసెంబర్ 9వ తేదీ వరకు గడువు ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆమె ప్రత్యక్ష పోరాటానికి దిగారు. కమ్యూనిస్ట్ పార్టీల శైలిలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయడం ద్వారా తమ ఉద్యమంలో భాగంగా నిరసనను దిగాలని నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. కరీంనగర్‌లో మొదలైన ఈ భూ పోరాటాన్ని త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయాలని కవిత భావిస్తున్నారు. ఉద్యమకారులకు దక్కాల్సిన ఇంటి స్థలాల హక్కు కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కవిత తెలిపారు. అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి స్థలం ఇచ్చే వరకు తెలంగాన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని ఈ సందర్భంగా ఆమె పునరుద్ఘాటించారు.కరీంనగర్ గడ్డ మీద ప్రారంభించిన ఏ ఉద్యమమైన విజయవంతమవుతుందని.. ఇప్పుడు ఇదే కరీంనగర్ నుండి నేడు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం కోసం చేపట్టిన ఉద్యమం కూడా విజయవంతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ గడ్డ నుంచి ప్రారంభం అయిన పోరాటం... భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఉద్యమకారులను ఏకం చేసి పోరాటాన్ని ఉదృతం చేస్తామన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరుల కుటుంబాలతో పాటు, ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు ఎత్తిన పిడికిలి దించకుండా పోరాడుతాం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేంతవరకు ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉండాలని నిర్ణయం తీసుకున్నారు.

## ఒక్క రోజే ముందే ఫించన్లు

కోసం ప్రభుత్వం రూ.2,743 కోట్లు విడుదల చేసిందిశ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా నందిగం మండలం దీనబంధుపురంలో గతంలో పింఛన్లు నిలిచిపోయిన 9 మందికి కోర్టు ఆదేశాల మేరకు బకాయిలతో సహా పింఛన్లను పునరుద్ధరించారు. నిలిపివేసిన రోజు నుంచి ఇప్పటివరకూ లెక్కించిన మొత్తం రూ.18 లక్షలను మంత్రి అచ్చెన్నాయుడు స్వయంగా ఆ 9 మంది లబ్ధిదారులకు అందజేయడం విశేషం.

పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు. మరోవైపు ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు పింఛన్ల కోసమే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. పేదల జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ కార్యక్రమం తనకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని, కొత్త ఏడాదిలో అందరికీ మంచి జరగాలని సీఎం ఆకాంక్షించారు.

## త్వరలో 14 వేల పోలీస్ కానిస్టేబుళ్ల భర్తీ

✍ **జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 31:**

నిరుద్యోగులకు భారీ శుభవార్త. కొత్త సంవత్సరం 2026లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తుంది. సరికొత్తగా జాబ్ క్యాలెండర్ రీ షెడ్యూల్ చేసి శాఖల వారీగా ఖాళీలతో నివేదికలను రూపొందిస్తోంది. తాజాగా రిటైర్మెంట్లు పెరగడంతో ఏర్పడిన ఖాళీలను పదోన్నతులతో పాటు, నేరుగా నోటిఫికేషన్లతో నియమించుకోవాలన్న యాక్షన్ ప్లాన్ కు తుది మెరుగులు దిద్దుతోంది.ప్రైవేట్ రంగంలో భారీ సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు చర్యలు చేపడుతున్న ప్రభుత్వం.. ప్రభుత్వ రంగంలోనూ ఆయా శాఖల్లోని ఖాళీలను భర్తీకి పెద్ద సంఖ్యలో ఉద్యోగాల నియామకాలను చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం జనవరి, ఫిబ్రవరి నెలలో నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆర్టీసీలో 198 సూపర్‌వైజర్ పోస్టులు, పోలీస్ నియామకాలకు సంబంధించిన ప్రకటనలు, యూనివర్శిటీల నియామకాల్లో జాప్యం, పలు శాఖల్లో కారుణ్య నియామకాలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. పోలీస్ శాఖలో త్వరలో భారీ సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 14వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయనున్నామని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. సుమారు 14వేల స్టయిపెండరీ క్యాడెట్ కానిస్టేబుళ్లతోపాటు ఇతర యూనిఫామ్ సర్వీసుల కానిస్టేబుళ్ల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉన్నాయని డీజీపీ తెలిపారు. నూతన సంవత్సరంలో దీనికి సంబంధించిన ప్రకటన వెలవడుతుందని ఆయన చెప్పారు.

తెలంగాణ పోలీసు శాఖలో దాదాపు 14 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం నేరాలు తగ్గినప్పటికీ.. మహిళలపై అకృత్యాలు పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసుల కృషి ప్రశంసనీయమని కొనియాడారు. తెలంగాణ పోలీసు శాఖలో ఖాళీల భర్తీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తీపి కబురు. రాష్ట్రంలో దాదాపు 14 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. చాలా కాలంగా నోటిఫికేషన్ కోసం నిరీక్షిస్తున్న వేలాది మంది అభ్యర్థుల్లో ఈ ప్రకటన కొత్త ఆశలు చిగురింపజేసింది. మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో.. 'తెలంగాణ నేర వార్షిక నివేదిక 2025'ను విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. డీజీపీ ప్రకటనతో త్వరలోనే నోటిఫికేషన్ వస్తుందని నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయన్న విమర్శలను డీజీపీ కొట్టిపారేశారు.

గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య 2.33 శాతం మేర తగ్గుముఖం పట్టిందన్నారు. 2023 నవంబర్ నాటికి రాష్ట్రంలో 2,34,158 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది నవంబర్ నాటికి ఆ సంఖ్య 2,28,695కు తగ్గిందని చెప్పారు. ముఖ్యంగా అల్లర్ల సంఖ్య 42 శాతం తగ్గడం పోలీసుల పనితీరుకు నిదర్శనమని డీజీపీ పేర్కొన్నారు. శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని, ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు.'రాష్ట్రంలో మొత్తం నేరాలు తగ్గినప్పటికీ.. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మహిళల ప్రతిష్ఠకు భంగం కలిగించే కేసులు గత ఏడాదితో పోల్చితే 9.02 శాతం పెరిగాయి. 2021లో 4,476గా ఉన్న ఇటువంటి కేసులు, 2025 నాటికి 6,476కు చేరుకోవడం గమనార్హం. మహిళలపై మొత్తం నేరాల సంఖ్య కూడా 3.16 శాతం పెరిగి 20,551కి చేరింది. అయితే, అత్యాచారాలు, వరకట్న వేధింపులు, కిడ్నాప్‌లు, ఆత్మహత్య ప్రేరణ వంటి కేసులు తగ్గడం కొంత ఊరటనిచ్చే అంశం. మోసపూరితంగా శారీరక సంబంధం పెట్టుకునే ఉదంతాలపై కొత్తగా అమల్లోకి వచ్చిన బీఎన్ఎస్ సెక్షన్ 69 కింద ఈ ఏడాది 69 కేసులు నమోదు చేశాం.దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు 41 శాతం పెరుగుతుంటే.. తెలంగాణలో మాత్రం పోలీసుల ముమ్మర కసరత్తు వల్ల 3 శాతం తగ్గాయి. సైబర్ నేరాల వల్ల కలిగే ఆర్థిక నష్టాలు దేశస్థాయిలో 6 శాతం తగ్గగా, తెలంగాణలో ఏకంగా 21 శాతం తగ్గుదల నమోదైంది. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) కృషి ఫలితంగా ఈ ఏడాది 24,498 మంది బాధితులకు రూ.159.65 కోట్లను తిరిగి ఇప్పించగలిగారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన 'ఈగల్' బృందం ఈ ఏడాది విశేష ఫలితాలను సాధించింది. సుమారు రూ.172.93 కోట్ల విలువైన డ్రగ్స్‌ను జప్తు చేశారు. ఎన్‌డీపీఎస్ కేసుల నమోదులో 30.36 శాతం పెరుగుదల కనిపించింది, అంటే నిఘా పెరగడం వల్ల నేరస్థులు ఎక్కువగా పట్టుబడుతున్నారు. ఇక మావోయిస్టుల విషయానికి వస్తే, తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే ఏడాది 509 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు.' అని డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు.

# వైభవంగా యాదగిరీశుడి అధ్యయనోత్సవాలు

- వేణుగోపాల శ్రీకృష్ణాలంకారం, గోవర్ధనగిరిధారిగా భక్తులకు దర్శనం

**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 31:**



శ్రీ స్వయంభూ పంచనారసింహ క్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నారు. ఉత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం శ్రీవేణుగోపాల శ్రీకృష్ణాలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా సాయంత్రం గోవర్ధన గిరిధారి అలంకారంలో స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో ఉదయం నిత్యారాధనల అనంతరం దివ్య ప్రబంధ పారాయణములను పారాయణికులు నిర్వహించిన అనంతరం శ్రీ వేణు గోపాలస్వామి కృష్ణాలంకారంలో అలంకారంలో ఆలయ తిరువీధులలో ఊరేగుతూ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం గోవర్ధనగిరిధారిగా భక్తులకు కనువిందు చేశారు.

**శ్రీవేణుగోపాల కృష్ణాలంకార సేవ..**

శ్రీవేణుగోపాల కృష్ణాలంకారంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అలంకార విశిష్టతను అర్చకులు వివరించారు. భగవానుడి లీలావతారాలలో అద్భుతమైన తత్వములు ఎన్నో ఉన్నాయని,అందులో వైభవోపేతమైన అవతారం శ్రీకృష్ణావతారమని వివరించారు. శ్రీ కృష్ణుని అలంకార విశిష్టత అంటే





ఆయన స్వరూప సౌందర్యాన్ని, దివ్య తత్వాన్ని, లీలలను వివిధ రూపాల్లో కీర్తించడమని తెలిపారు. శ్రీకృష్ణాలంకార సేవలో స్వామివారిని దర్శించిన భక్తులకు ఎంతో పుణ్యం లభిస్తుందని తెలిపారు.

**గోవర్ధనగిరిధారి అలంకారం..**

ఉత్సవాలలో భాగంగా గోవర్ధనగిరిధారి అలంకారంలో ఆలయ పురవీధుల్లో స్వామివారి ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. బృందావన లీలలలో గోవర్ధనగిరిధారి లీల ఎంతో ప్రభావాన్వితమైయున్నదని అర్చకులు వివరించారు. కృష్ణపరమాత్మ ఇంద్రునికి కలిగిన గర్వాన్ని తొలగించుటకై ఉత్సవాన్ని నిలుపుదల చేయగా ఇంద్రుడు గర్వాంధుడై బృందావనముపై కుంభవృష్టిని కురిపించి గోవులను, ఇతర పశుగణములను భయభ్రాంతులకు గురి చేయగా కృష్ణ భగవానుడు గోవర్ధనగిరిని అవలీలగా పెకిలించి చిటికెన వేలు మీద ఆ పర్వతమును నిలబెట్టి అందరిని గోవర్ధనగిరి క్రిందకు రమ్మని పిలిచి వారికి కలిగిన భయాందోళనను తొలగించాడని తెలిపారు. ఈ లీలలో భగవంతుని యొక్క భక్త రక్షణ తత్పరత ఎంతో అపూర్వమైనదని అర్చకులు తెలిపారు. ఈ వేడుకలలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, యాదగిరిగుట్ట ఆలయ ఈవో ఎస్.వెంట్రారావు, ఆలయ అధికారులు, సిబ్బంది,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ సన్మాన మహోత్సవం

- కొందుర్గు మండలం రేగడి చిలకమర్రి పంచాయతీ కార్యదర్శి లక్ష్మీతులసికి ఘనంగా వీడ్కోలు
- కాంగ్రెస్ పార్టీ నాయకులు పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం

**జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 31 :**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం రేగడి చిలకమర్రి గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మితులసి పదవి విరమణ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పురుషోత్తం రెడ్డి , జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వీడుకోలు కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ తులసినీ పులమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి ,గ్రామస్తులు మాట్లాడుతూ; పంచాయతీ కార్యదర్శిగా లక్ష్మీతులసి గ్రామంలో పని చేసిన అన్నిరోజులు ఏ సమస్య ఉన్న ప్రతి ఒక్కరికి స్పందించి అన్ని విధాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన ఆమె సేవలు మరువలేనివి అని అన్నారు. సర్పంచులు లేకముందు కేవలం ఆమె ఒక్కరే గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామంలో ప్రతిరోజు పర్యటించి ప్రజల సమస్యలను తమ సొంత సమస్యలుగా భావించి వీధి దీపాలు,వివిధ నిర్మాణ పనులు తక్షణమే చేసే విధంగా పూర్తిస్థాయిలో కృషి చేశారని గ్రామస్తులు ఆమెని అభినందించారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మితులసి మాట్లాడుతూ.. రేగడి చిలకమర్రి గ్రామస్తులు తనకు పూర్తి స్వేచ్ఛనిచ్చి గ్రామ అభివృద్ధి పనులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరూ సహకరించారని గ్రామస్తుల మేలుని ఎన్నడు కూడా మర్చిపోలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు.. నరసింహారెడ్డి, రాజు రెడ్డి,శ్రీను, రవి, కృష్ణ రెడ్డి ,కుమార్ , కృష్ణ ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మల్లేపల్లి పోలీస్ స్టేషన్లో దళిత నాయకులపై ఫిర్యాదు

- దళిత సంఘ నాయకులు హిందూ దేవాలయ గురించి మాట్లాడిన మాటలు వెనుక తీసుకోవాలి జనసేన పార్టీ, హిందూ ఐక్యవేదిక

**జయభేరి, కొండ మల్లేపల్లి :**



కొండమల్లేపల్లి మండలంలో చౌరస్తా లో రోడ్డు పనుల నిమిత్తం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ప్రహరీ గోడ గురించి దళిత సంఘాలు , ఆల్ ఇండియా సమాజ్ సైనిక దళ్ నాయకులు నిన్న నల్గొండ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియా ముందు మాట్లాడుతూ, అంబేద్కర్ విగ్రహం ఒకటే అడ్డుగా ఉందా రోడ్డు మీద ఉన్న దేవాలయాలని కూడా తొలగించాలని మాట్లాడిన మాటలు యావత్ హిందూ సమాజానికి కించపరిచే విధంగా ఉంది అని జనసేన పార్టీ హిందూ ఐక్యవేదిక సంఘ నాయకులు మల్లెపల్లి పోలీస్ స్టేషన్లో దళిత నాయకులపై ఫిర్యాదు ఇవ్వడం జరిగింది వెంటనే దళిత సంఘం నాయకులు క్షమాపణ చెప్పాలని లేనియెడల ఉద్రిక్తం చేసి ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు బంజారా సినీ హీరో చందు నాయక్ మాట్లాడుతూ భారత దేశంలో హిందూ దేవాలయాలు చర్చి మజీద్ దేవాలయాల గురించి మాట్లాడితే జనసేన పార్టీ ఊరుకోదని అలాగే పోలీస్ వ్యవస్థకు అనుకూలంగా జనసేన పార్టీ పనిచేస్తుందని చందు నాయక్ అన్నారు.

భరత్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం ప్రహరీ గోడ తొలగించినప్పుడు దళిత సంఘం నాయకులకు మేము మద్దతు ఇవ్వడం జరిగింది కావున హిందూ దేవాలయం గురించి తక్కువ మాట్లాడినందుకు యావత్ భారత దేశ హిందూ సమాజానికి కించపరచినట్టు ఉంది కనుక వెంటనే క్షమాపణ తెలియజేయాల్సిందిగా భరత్ కోరారు.

ఈ కార్యక్రమంలో జంగేటి మల్లేష్ యాదవ్ కుంభం గిరి గౌడ్, కొత్తగోళ్ల నరేష్, బోడ కృష్ణ, బోడు యాదయ్య, పదుల ఉదయ్ గౌడ్, బుతర రాజ భారత్ కుమార్ హిందూ ఐక్యవేదిక జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

- మంత్రి పొన్నం

**జయభేరి, హైదరాబాద్ :**

జనవరి 1 వ తేదీ నుండి జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలి. రేపటి నుండి జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం అవుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రవాణా శాఖ పక్షాన జనవరి 1 నుండి 31 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. అన్ని జిల్లాలు , మండలాలు , గ్రామాల్లో రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్న. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో రోడ్డు బద్రత నిబంధనలు పాటిస్తామని హామీ పత్రం ఇవ్వండి. ప్రతి పాఠశాల రోడ్ భద్రతా క్లబ్ లో చేరాలి. రవాణా శాఖ సూచనలు పాటించండి.. హెల్మెట్ ధరించాలి.. మద్యం తాగి వాహనం నడపరాదు,రాంగ్ రూట్లో ప్రయాణం వద్దు ,అతివేగంతో వాహనం నడపరాదు. రోడ్డు ప్రమాదాల వల్లే మరణాలు అధికంగా సంభవిస్తున్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ,అధికారులు , విద్యార్థులు,ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని అన్నారు.



# ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

- నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలి
- నూతన ఏడాది ప్రజలకు సరికొత్త ఉత్సాహాన్నివ్వాలి
- దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**జయభేరి, దేవరకొండ :**

ప్రజలందరికీ బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ నూతన సంవత్సరం2026 శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఆశలు, ఆశయాలతో ప్రతీ ఒక్కరూ కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలని ఆయన ఆకాంక్షించారు. నిర్దిష్ట లక్ష్యాలను రూపొందించుకుని యువత తమ ఆశయ సాధనకై ముందుకు సాగాలని కోరారు. జీవితం పట్ల సరైన దృక్పథం, సంకల్ప బలం ఉంటేనే లక్ష్య సాధనలో సఫలీకృతులవుతారని ఉద్ఘాటించారు. ఎన్నో అవాంతరాలు, సమస్యలు, వివక్షను ఎదుర్కొంటూ నేడు భారత దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానం అందరికీ ఆదర్శనీయమని స్పష్టం చేశారు. అనతికాలంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి రోల్ మోడల్ గా మారిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ దినదినాన మరింత బలోపేతం అవుతోందని, బీఆర్ఎస్ పార్టీ వెన్నంటే ఉన్న కార్యకర్తలంతా కొత్త ఏడాదిలో కూడా పార్టీ ప్రతిష్ట కోసం రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు.2026 కొత్త సంవత్సర వేళ ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం వెల్లి విరియాలని.. రాష్ట్ర ప్రజలు, రైతులు పాడిపంటలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అన్నారు.అలాగే గౌరవ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని, కోరుకుంటున్నానని తెలిపారు.ఈ నూతన సంవత్సరంలో మీ అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నిండాలని,నూతన ఉత్సాహంతో సరికొత్త ప్రణాళికలతో మీరు మరింత ముందుకు వెళ్లి విజయం సాధించాలని..మీరు అనుకున్న పనులు సంకల్ప శక్తితో సాధించి, ముందుకు వెళతారని ఆశిస్తున్నానని అన్నారు.జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే గత చేదు అనుభవాలను ఎప్పటికీ గుర్తు చేసుకోకూడదని, కేవలం భవిష్యత్తు ప్రణాళిక పై దృష్టి సారిస్తే అందరూ తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రస్తుతం యువకులుగా ఉండి, పార్టీలో పనిచేస్తున్న వారికి ఉజ్వలమైన రాజకీయ భవిషత్తు ఉంటుందని, తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని, దానివల్ల నష్టం తప్ప,లాభం ఉండదని తెలిపారు.రాజకీయాల్లో ఓపిక అవసరమని, అవకాశాలు వచ్చే వరకు, ఉండి,ఆ సమయం వచ్చినప్పుడు అంది పుచ్చుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రజలు, దేవరకొండ నియోజకవర్గ ప్రజలు అందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.



# ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు రామన్న

- ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి
- కేటీఆర్ కు శ్రీవారి ప్రసాదాన్ని అందచేసిన ఎమ్మెల్సి నవీన్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 31 :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. అదే విధంగా నూతనంగా ఎన్నుకోబడిన వీర్లపల్లి సర్పంచ్ పాండు తదితరులు కేటీఆర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ; నూతనంగా గెలుపొందిన సర్పంచ్ , ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామంలో అభివృద్ధి పనులు చేసి మంచి పేరు ప్రతిష్టలు పొందాలని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అన్ని గ్రామాలలో పరిషత్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించడానికి అందరి కలిసికట్టుగా పనిచేసి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని సూచించారు.

# శివ మారుతీ గీతా అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్న ప్రసాద వితరణ

- కేశం పేట మాజీ జడ్పిటిసి తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి వివాహ వార్షికోత్సవ సందర్భంగా కార్యక్రమం
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 31 :**

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని శివ మారుతీ గీతా అయ్యప్ప స్వామి దేవాలయంలో 44వ రోజు అయ్యప్ప స్వాముల దీక్ష సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కేశంపేట మాజీ జడ్పిటిసి శ్రీమతి తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరై, ముందుగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డిని శాలువాతో సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు లష్కర్ ఆంజనేయులు, ప్రతాప్ రెడ్డి, రాయికల్ శ్రీను, శ్రీధర్ రెడ్డి, జంగ నర్సింహులు, రేటికల్ నందీశ్వర్, అనసూయమ్మ, దాస కృష్ణయ్య, వెంకటేష్ గౌడ్ స్వామి, కోటిలింగం గౌడ్ స్వామి, మార్గం రాజేష్, గోలేపు రాఘవేందర్, తొండుపల్లి శ్రీచరణ్ రెడ్డి, దిలీప్, గంగమోని సత్తయ్య, నవీన్, రమేష్, మహేష్ గౌడ్, ప్రకాష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలు పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు



**జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 31:**

58వ రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలు పోటీలకు తుర్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అంబటి శోభారాణి తెలిపారు ఈనెల 14వ తేదీన బొమ్మల రామారం మండలం మరియాల గ్రామంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఖో ఖో పోటీలు టోర్నమెంట్ నిర్వహించారు ఈ టోర్నమెంట్ లో మొదటి బహుమతి తుర్కపల్లి మండలం మోడల్ స్కూల్ కు చెందిన లింకల మానస విద్యార్థి సాధించినట్లు తెలిపారు ఈనెల 30, 31, జనవరి 1 తేదీల్లో వికారాబాద్ జిల్లాలోని తాండూరులో జరుగు రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలు పాల్గొంటారని తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లె రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

# జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జర్నలిస్టులు




**జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 31:**

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామ సర్పంచ్ బొత్త రాములు మనుమడి జన్మదిన వేడుకల్లో తుర్కపల్లి మండల జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారి హర్షవర్ధన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పెండెం రవి, ఏశాల కృష్ణ, తునికి శ్రీనివాస్ గౌడ్, కళ్యాణ్ కొండల్, గడిపే ఇంద్రయ్య, జివిలికపల్లి మహేష్, కొత్త ఇంటి సురేష్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్టాక్ మార్కెట్ మించి బంగారం, వెండి రాబడి

జయభేరి, ముంబై, డిసెంబర్ 31:




దేశంలో బంగారం, వెండి ధరలు భగ్గుమంటున్న తరుణంలో నిన్నటి నుంచి తగ్గుముఖం పడుతున్నాయి. తులం బంగారం ధర దాదాపు 1,42,000 వరకు వెళ్లి బంగారం ధర.. మంగళవారం నుంచి క్రమంగా దిగి వస్తున్నాయి. వెండి కూడా అంతే ధర రూ.1,70,000 వరకు వెళ్లిన వెండి ధర.. ఇప్పుడు భారీగానే దిగి వస్తోంది. ప్రస్తుతం డిసెంబర్ 31న బంగారం ధరలు భారీగా దిగి వచ్చాయి. ప్రస్తుతం తులం బంగారం ధర రూ.1,35,880 వద్దకు చేరుకుంది. అదే విధంగా కిలో వెండి ధర రూ.2,40,000 వేల వద్ద కొనసాగుతోంది. ఈ ఏడాదిలో బంగారం, వెండి ఎంత పెరిగింది?ఈ ఏడాది 2025 జనవరి 1వ తేదీన దేశీయంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,000 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.71,500 వద్ద కొనసాగింది. ప్రస్తుతం తులం ధర రూ.1,35, 880 వద్ద ఉంది. ఇదే విధంగా వెండి కిలోకు రూ.90,000 వద్ద ఉండేది. ప్రస్తుతం రూ.2,40,000 వద్ద కొనసాగుతోంది.2025 సంవత్సరంలో బంగారం, వెండి ధరలలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. దీనిలో బంగారం ధర 74 శాతానికి పైగా పెరిగింది. వెండి ధర 138 శాతం పెరుగుదలను నమోదు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. దీనికి ప్రధాన కారణం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత, కేంద్ర బ్యాంకులు నిరంతరం బంగారం కొనుగోలు చేయడం, బంగారు ETF కోసం డిమాండ్, దీని కారణంగా బంగారం పెరిగిందని నివేదికలు చెబుతున్నాయి. పారిశ్రామిక డిమాండ్ కారణంగా వెండి ధర ఎక్కువగానే ఉంది. ఈలోగా వెండి సరఫరా, డిమాండ్‌కు సంబంధించి మార్కెట్లో కూడా మార్పులు కనిపించాయి. 2026 సంవత్సరంలో బంగారం, వెండి పెరుగుదల కొనసాగుతుందని అంచనా. 2025 సంవత్సరం బంగారం, వెండి, రాగికి నిర్ణయాత్మక సంవత్సరంగా గుర్తుండిపోతుంది. ఎందుకంటే మూడు లోహాల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఇది 40 సంవత్సరాలకు పైగా కాలంలో అత్యంత బలమైన వస్తువుల ర్యాలీలలో ఒకటిగా ఉన్నాయని అనేక మంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఆనంత్ రతి, స్టాక్ బ్రోకర్స్‌లోని కమోడిటీస్ అండ్ కరెన్సీ డైరెక్టర్ నవీన్ మాథుర్ ప్రకారం, 2025 విలువైన లోహాలకు అసాధారణమైన సంవత్సరం. రిటైల్ పెట్టుబడిదారులు, సంస్థల నుండి హెడ్జ్ ఫండ్స్, గ్లోబల్ సెంట్రల్ బ్యాంకుల వరకు అన్ని రంగాలలోని పెట్టుబడిదారులు బంగారంలో తమ పెట్టుబడులను పెంచారు.బంగారం, వెండి నాలుగు దశాబ్దాలలో అత్యుత్తమ పనితీరును కనబరిచాయి. 2025లో వెండి దాదాపు 138 శాతం పెరిగి, ప్రముఖ ఆస్తిగా మారింది. అలాగే బంగారం ధరలు 74 శాతానికి పైగా పెరిగాయి. ఇది దశాబ్దంలో అత్యంత లాభదాయకంగా మారింది.2025లో బంగారం, వెండి నుండి వచ్చే రాబడి స్టాక్ మార్కెట్, ఇతర పెట్టుబడి రాబడి కంటే ఎక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. పారిశ్రామిక డిమాండ్ కారణంగా వెండి రికార్డు లాభాలను చవిచూసింది. ఈ సంవత్సరం వెండి బంగారం కంటే 100 శాతం రాబడిని అందించింది. బంగారం 83 శాతం రాబడిని అందించింది. అదే సమయంలో నిఫ్టీ 50 డిసెంబర్ 19, 2025 నాటికి 9.4 శాతం రాబడిని అందించింది.

---



## ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన వార్డు సభ్యులు

జయభేరి, కొండ మల్లేపల్లి :

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న 8,9,10 వార్డు సభ్యులు బిజిలి లింగం, గంట మల్లేష్, బొడిగ శంకర్ గౌడ్ మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసినారు. వార్డులలో ఏ సమస్యలున్న మా దృష్టికి తీసుకురండి అధికారులకు తెలియజేసి సమస్యలు తీరుస్తామని వార్డు సభ్యులు తెలియజేసినారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరికి వారు అనుకున్న కోరికలు నెరవేరాలని వార్డు సభ్యులు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ లీడర్లు మహిళలు పాల్గొన్నారు.

---

## సాలమాన్ పదవి విరమణ కార్యక్రమం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన తీర్గమల్ల సాల మాన్ గత 30 సంవత్సరాలు దేవరకొండ నీటిపారుదల శాఖలో హెల్పర్ గా విశిష్ట సేవలందించి బుధవారం దేవరకొండ పట్టణంలోని ఐబి లో జరిగిన పదవి విరమణ కార్యక్రమంలో బహుజన మేధావి డాక్టర్ యే కుల రాజారావు, మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి పాల్గొని శాల్వాతో సన్మానించి గౌతమ బుద్ధుని చిత్రపటం బహుకరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగానికి మాత్రమే పదవి విరమణ కానీ మీ జీవితానికి కాదని నిజజీవితంలో ఆయురారోగ్యాలతో ఉండి సమాజానికి మీ సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు డివిజన్ ప్రధాన కార్యదర్శి మేడ సైదులు, డివిజన్ ఉపాధ్యక్షులు కోరెక్క చెన్నయ్య, మాల మహానాడు నాయకులు ఎర్ర వెంకటయ్య, కాల వెంకటయ్య, బంధుమిత్రులు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

---

## నట్టల నివారణ మందులను గొర్ల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలి



జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 31:

నటల నివారణ మందులను గొర్ల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు .బుధవారం తుర్కపల్లి మండలం ధర్మారం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మేకలకు గొర్రెలకు ఉచిత నట్టాల నివారణ మందులా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మందుల వల్ల గొర్రెల్లో అంతర్పరన్న జీవులు నశించి అధిక బరువు, వ్యాధి నిరోధక శక్తి, పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రజిని సురేందర్, ఉపసర్పంచ్ యమునా నరేంద్ర, పశు సంవర్ధక శాఖ సిబ్బంది రాఘవేంద్ర, శంషాద్దీన్, పెండెం ప్రవీణ్, కావడి ప్రవీణ్, ధనావత్ కృష్ణ పాల్గొన్నారు.

---

## నార్లాపూర్ నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క

- మేడారం జాతర దృష్ట్యా కీలక ముందడుగు




జయభేరి, ములుగు :

తాడ్వాయి మండలం మేడారం నందు నూతనంగా నిర్మించిన నార్లపూర్ పోలీస్ స్టేషన్‌ను రాష్ట్ర పంచాయతీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకాన్ ఐపీఎస్ అధ్యక్షతన జరుగగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర, ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ బట్ పాల్గొన్నారు. ఈ పోలీస్ స్టేషన్ లో స్టేషన్ హౌస్ అధికారి ఎస్ఐ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయిలలో సుమారుగా 30 మంది పనిచేయనున్నారు. ఈ నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం మేడారం మహాజాతర దృష్ట్యా ఎల్లప్పుడూ ప్రజలకు భక్తులకు గుత్తికొయా గిరిజన ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జాతర సమయంలో లక్షలాది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేగవంతమైన పోలీస్ సేవల అందించడంలో ఈ స్టేషన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. నార్లాపూర్ పోలీస్ స్టేషన్ హౌస్ అధికారిగా ఎస్ ఐపి. కమలాకర్ విధులు నిర్వహించనున్నారు, పస్రా పరిధిలో ఈ స్టేషన్ పనిచేస్తుంది పస్రా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దయాకర్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారు. జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు, ఇది ప్రజలకు మరింత చేరువైన, సమర్థవంతమైన సేవలకు నాంది పలుకుతుందని అన్నారు.

---



## తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘానికి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సుందర్ కల్లూరి

జయభేరి, హైదరాబాద్ :

జర్నలిస్టుల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో ముందుంటానని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సుందర్ కల్లూరి అల్టిమేటం జారీ చేశారు.. ఈనేపథ్యంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత పిఆర్వోగా రెండు ప్రభుత్వాలలో పని చేసిన అనుభవం ఉన్నటువంటి సుందర్ కల్లూరిని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వరరావు నియమించడం జరిగింది. ఈ సందర్భంగా సుందర్ కల్లూరి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికై ఆవిర్భవించినటువంటి తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘనికి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినటువంటి గౌరవ అధ్యక్షులు ఆనం చిన్ని వెంకటేశ్వరరావుకి తోటి కార్యవర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.. జర్నలిస్టుల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో ముందుంటానని అలాగే జర్నలిస్టుల సంక్షేమానికై అహర్నిశలు కష్టపడతానని, తనకు అప్పగించినటువంటి బాధ్యతకు న్యాయం చేస్తానని తెలియజేశారు.

---

## అగ్ని ప్రమాదం

జయభేరి, హైదరాబాద్ :

కూకట్ పల్లి డివిజన్ లోని పాపిరెడ్డి నగర్ బి బ్లాక్ లోని రోడ్డు నెంబర్ 4 ఓ ఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫ్రిజ్ నుండి మంటలు చెలరేగి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామాన్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. వెంటనే ఇంట్లో ఉన్నవారు సకాలంలో స్పందించి మంటలను అదుపు చేసి ఫ్రిజ్ ను బయటికి తీసుకొని వచ్చారు. దీనితో పెను ప్రమాదం తప్పింది.

---

## సీబీఎస్సీ పరీక్షల్లో మార్పులు

జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 31:



సీబీఎస్ఈ బోర్డు నిర్వహించనున్న 10వ, 12వ తరగతుల పరీక్షల టైం టేబుల్ 2026లో స్వల్ప మార్పు చోటుచేసుకున్నట్లు సీబీఎస్సీ బోర్డు ప్రకటించింది. మార్చి 3, 2026న జరగాల్సిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. సీబీఎస్సీ పదో తరగతి, 12వ తరగతుల విద్యార్థులకు మార్చి 3న జరగాల్సిన పరీక్షలను రీషెడ్యూల్ చేసినట్లు సీబీఎస్ఈ తన ప్రకటనలో వెల్లడించింది. పరిపాలనాపరమైన కారణాల వల్లనే ఈ పరీక్షల షెడ్యూల్‌లో మార్పు చేసినట్లు వివరించింది. దీంతో మార్చి 3వ తేదీన పదో తరగతి విద్యార్థులకు జరగాల్సిన పరీక్షను మార్చి 11వ తేదీకి మార్పు చేసింది. అలాగే 12వ తరగతి విద్యార్థులకు మార్చి 3న జరగాల్సిన పరీక్షను ఏప్రిల్ 10వ తేదీకి మార్పు చేసినట్లు ప్రకటనలో తెలిపింది. ఈ మార్పు మినహా మిగతా పరీక్షల తేదీల్లో ఎలాంటి మార్పులేదని స్పష్టం చేసింది. ఇతర పరీక్షలన్నీ గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే యథాతథంగా జరుగుతాయని తెలిపింది.కాగా సీబీఎస్సీ బోర్డు పరీక్షలు ఫిబ్రవరి 17, 2026 నుంచి ప్రారంభమవుతాయి. పరీక్షలు ఆయా తేదీల్లో ప్రతిరోజూ ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరగనున్నాయి. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 3న పదో తరగతి విద్యార్థులకు టిబెటన్, జర్మన్, నేషనల్ క్యాడెట్ కార్ప్స్, జపనీస్, స్పానిష్, మిజో, కశ్మీరీ, ఎలిమెంట్స్ ఆఫ్ బుక్ కీపింగ్ అండ్ అకౌంటెన్సీ వంటి పరీక్షలు జరగాల్సి ఉంది. ఇక 12వ తరగతి విద్యార్థులకు ఇదే తేదీన లీగల్ స్టడీస్ పరీక్ష జరగాల్సి ఉంది. తాజాగా మార్చి 3వ తేదీన జరిగే అన్ని పరీక్షలను వాయిదా వేయడంతో ఆయా పరీక్షలు మార్చి 11, ఏప్రిల్ 10 తేదీల్లో జరగనున్నాయి. ఈ మేరకు పాఠశాలలు తమ విద్యార్థులకు వీలైనంత త్వరగా సమాచారాన్ని తెలియజేయాలని బోర్డు సూచించింది.

---

## ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాయలసీమలో జలకళ

- పుట్టపర్తి నియోజవర్గంలోనీ అన్ని చెరువులను కృష్ణా జలాలతో నింపుతాం.
- ప్రజలందరికీ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు
- నియోజవర్గం లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

జయభేరి, కొత్త చెరువు/పుట్టపర్తి :



ఎడారి ప్రాంతమైన రాయలసీమ ప్రాంతానికి పూర్తిగా జలకల రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక కృషితోనే సాధ్యమైందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచాయతీలోని నారాయణపురం ,అప్పలవాండ్లపల్లి ,గౌనికుంటపల్లి , పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా వృద్ధులకు వితంతు వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామాల్లో ప్రజలు కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పూలవర్షం కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికారు. పింఛన్లు పంపిణీ తో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం లో జనవరి 1 తేదీ కంటే ఒకరోజు ముందుగానే డిసెంబర్ 31న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ తో గ్రామాల్లో ఉన్న ప్రజలకు నూతన సంవత్సర 2026 వేడుకలు ప్రారంభమయ్యాయనీ నియోజవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతాల్లో నీటి కళ వచ్చిందన్నారు. ఈ ఐదేళ్లలో కూటమి ప్రభుత్వం లో నియోజవర్గం లోని అన్ని చెరువులకు కృష్ణా జలాలతో నింపుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కులాలకు మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు సమాన స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పెద్ద ఎత్తున సంక్షేమం ,అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన రాష్ట్రాలు ఏవి లేవని ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లోనే సంక్షేమ ,అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయని తెలిపారు. పెన్షన్లు రెట్టింపు తల్లికి వందనం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు సహాయం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు సిలిండర్లు అందజేస్తున్నామని ప్రజలకు వెల్లడించారు. ఈ ఏడాది 2025 కు వీడ్కోలు పలుకుతూ 2026 నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.




# నవ్వులు పంచే భర్త మహాశయ

రవితేజ నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. సినిమాలోని 'వామ్మో వాయ్యో' అనే గీతాన్ని ఈ నెల 2న విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సాంగ్ ప్రోమోను రిలీజ్ చేశారు. ఇందులో నాయకానాయికలు రవితేజ, ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కలర్‌ఫుల్ అవుట్‌ఫిట్స్‌లో హుషారుగా స్టెప్పులేస్తూ కనిపిస్తున్నారు. పండుగ జోష్‌ను తెరపై ఆవిష్కరించే మాస్ సాంగ్ ఇదని, గ్రాండ్ విజువల్స్‌తో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఆద్యంతం వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందించామని, రవితేజ తనదైన శైలి కామెడీతో అలరిస్తారని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు.

# సంగీత దర్శకుడి నుంచి నటుడిగా ఏఆర్ రెహ్మాన్ కొత్త ప్రయాణం.. ప్రభుదేవా సినిమాలో కీలక పాత్ర



సంగీత ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన ఆస్కార్ విజేత ఏఆర్ రెహ్మాన్ ఇప్పుడు మరో కొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు తన సంగీతంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించిన రెహ్మాన్, తొలిసారి పూర్తి స్థాయిలో నటుడిగా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించనున్నారు. గతంలో కొన్ని చిత్రాల్లో అతిథి పాత్రల్లో దర్శనమిచ్చినప్పటికీ, నటుడిగా పూర్తి స్థాయిలో కనిపించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. కొరియోగ్రాఫర్, దర్శకుడు, నటుడు ప్రభుదేవా హీరోగా నటిస్తున్న తాజా కామెడీ చిత్రం 'మూన్‌వాక్'లో ఏఆర్ రెహ్మాన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాలో రెహ్మాన్, తన పేరుతోనే ఉన్న ఓ మూవీ డైరెక్టర్ పాత్రలో కనిపించబోతుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రానికి మనోజ్ నిర్మల శ్రీధరన్ దర్శకత్వం వహిస్తున్నారు.ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, "ఈ పాత్ర ఆలోచన వచ్చిన వెంటనే ప్రభుదేవాకు చెప్పాను. రెహ్మాన్ సార్‌కు ఇది పూర్తిగా కొత్త అనుభవమవుతుందని అనిపించింది. సరదాగా చేయమని అడిగితే, ఆయన ఎంతో ఆనందంగా ఒప్పుకున్నారు. తీవ్రమైన బిజీ షెడ్యూల్ మధ్య కూడా మా సినిమా కోసం సమయం కేటాయించారు" అని తెలిపారు.'మూన్‌వాక్' చిత్రం వచ్చే ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో ప్రభుదేవా, ఏఆర్ రెహ్మాన్‌లతో పాటు యోగిబాబు, రెడిన్ కింగ్‌స్లీ, అజు వర్గీస్ వంటి ప్రముఖ నటులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. రెహ్మాన్‌ను నటుడిగా కొత్త అవతారంలో చూడబోతుండటంతో ఆయన అభిమానుల్లో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. ఇదిలా ఉండగా, సంగీత రంగంలో రెహ్మాన్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం తెలుగులో రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా 2026 మార్చి 27న థియేటర్లలో విడుదల కానుంది. సంగీతం నుంచి నటన వరకు విస్తరిస్తున్న రెహ్మాన్ ప్రయాణం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



# సాహసమే ఊపిరిగా..

'కేజీఎఫ్' ఫ్రాంఛైజీ చిత్రాల తర్వాత కన్నడ అగ్ర నటుడు యశ్ నటిస్తున్న పాన్ ఇండియా గ్యాంగ్‌స్టర్ డ్రామా 'టాక్సిక్'. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' ఉపశీర్షిక. దర్శకురాలు గీతూమోహన్ దాస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు నటిస్తారని వార్తలొచ్చాయి. ఇప్పటికే కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషీ ఫస్ట్‌లుక్స్‌ని విడుదల చేయగా..వాటికి మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమాలో లేడీ సూపర్‌స్టార్ నయనతార కూడా భాగమవుతున్నది. బుధవారం ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె గంగ అనే పాత్రలో కనిపించనుంది. మోడ్రన్ డ్రెస్‌లో చేతిలో గన్ పట్టుకొని కాసినో ద్వారం వద్ద ఉన్న నయనతార లుక్ ఆకట్టుకునేలా ఉంది. ధైర్యం, సాహసం ఊపిరిగా గంగ పాత్ర శక్తివంతంగా సాగుతుందని, కథాగమనంలో కీలకంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె నారాయణ, యశ్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.

# దుస్తులు విప్పి డ్యాన్స్ చేయ్..



టాలీవుడ్ హీరోయిన్ తనుశ్రీ దత్తా గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆమె ఎక్కువగా ముక్కుసూటిగా మాట్లాడుతూ నిత్యం వార్తలలో నిలుస్తుంది. ఒకప్పుడు వరుస సినిమాలతో అలరించిన ఆమె.. ఇప్పుడు ఏదో ఒక కారణం చేత సోషల్ మీడియాలో నిరంతరం వార్తల్లో నిలుస్తూనే ఉంది. మీటూ ఉద్యమం సమయంలో ఆమె మరో నటుడిపై తీవ్ర ఆరోపణలు చేసింది. అలాగే ఇప్పుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఒక దర్శకుడు తనతో అనుచితంగా ప్రవర్తించాడని తెలిపింది. ఆ డైరెక్టర్ తనతో డిమాండ్ చేస్తూ అసభ్యకరంగా మాట్లాడారని గుర్తు చేసుకుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తనుశ్రీ దత్తా మాట్లాడుతూ. "నువ్వు అంత పెద్ద దర్శకురాలివి కావు.. ఎందుకు అంత దురుసుగా మాట్లాడుతున్నావు.. దుస్తులు తీసేసి డ్యాన్స్ చేయ్.. అని అతడు నాతో చెప్పాడు. ఆ సమయంలో నేను మౌనంగా ఉన్నాను. అతడి వైపు చూసి సైలెంట్ అయ్యాను. అక్కడ నిలబడిన ఇతర నటీనటులు మాత్రం చాలా బాధపడ్డారు. అందరూ అతడు మాట్లాడేది తప్పు అని భావించారు. మీటూ ప్రచార సమయంలో ఎవరు ముందుకు వచ్చి మాట్లాడలేదు. ఆ సమయంలో అందరూ నన్ను సపోర్ట్ చేశారు. ఆ తర్వాత దర్శకుడు మౌనంగా ఉన్నాడు" అంటూ చెప్పుకొచ్చింది. "ఆ సన్నివేశంలో, నా వేషధారణ కొంచెం స్పష్టంగా ఉంది. నీ దుస్తులు విప్పి డ్యాన్స్ చేయ్ అని ఆ డైరెక్టర్ చెప్పాడు. మళ్లీ అతడే బయటకు వచ్చి ఇంటర్వ్యూలు ఇస్తున్నాడు" అని తను శ్రీ తెలిపింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరలవుతున్నాయి.

# రాజా సాబ్ నుండి సర్‌ప్రైజ్ ఇచ్చిన మేకర్స్.. రాజే యువరాజే...సాంగ్ విడుదల



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ది రాజా సాబ్'. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాను సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ ఓ మ్యూజికల్ సర్‌ప్రైజ్ అందించారు. 'ది రాజా సాబ్' సినిమా విడుదలకు ఇంకా ఎనిమిది రోజుల సమయం మాత్రమే ఉండటంతో ప్రమోషన్స్ మరింత వేగం పుంజుకున్నాయి.

క్రిస్మస్ స్పెషల్‌గా 'రాజే యువరాజే' సాంగ్ ప్రోమోను మేకర్స్ సోషల్ మీడియాలో విడుదల చేసిన మేకర్స్ న్యూ ఇయర్ గిఫ్ట్‌గా ఫుల్ ఆడియో సాంగ్ విడుదల చేశారు. "రాజే యువరాజే.. కొలిచేటి తొలి ప్రేమికుడే.. నడిపించేది అతడే" అంటూ సాగే ఈ మ్యూజికల్ సాంగ్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ ఈసారి ఫ్రెష్ ట్యూన్‌తో మరోసారి మెస్మరైజ్ చేయనున్నాడని అర్థమవుతోంది. 'ది రాజా సాబ్' ఇండియాలోనే బిగ్గెస్ట్ హారర్ ఫాంటసీ మూవీగా రూపొందుతున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. ఇది ప్రభాస్ కెరీర్‌లోనే తొలి హారర్ జానర్ చిత్రం కావడం విశేషం. ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు మారుతి తెలిపారు. ఈ చిత్రంలో సంజయ్ దత్, బోమన్ ఇరానీ, జరీనా వాహబ్, సముద్రఖని, వెన్నెల కిశోర్, బ్రహ్మానందం, వీటీవీ గణేష్, సత్య, సప్తగిరి, ప్రభాస్ శ్రీను, జిషు షేన్ గుప్తా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కార్తీక్ పళని సినిమాటోగ్రఫీ నిర్వహిస్తుండగా, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. రాజీవన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తుండగా, రామ్ లక్ష్మణ్, కింగ్ సోలొమన్ యాక్షన్ కొరియోగ్రఫీ అందించారు. 'ది రాజా సాబ్' సినిమాను జనవరి 9న వరల్డ్‌వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించగా, రెబల్ స్టార్ అభిమానులు ఈ మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**